అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 06 జూన్ 2023

బట్ట సంచి వితరణ యంత్రం ప్రారంభం

కాగజ్‌నగర్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూరు పేపర్ మిల్లు సైకిల్ స్టాండ్ వద్ద యాజమాన్యం ఏర్పాటు చేసిన బట్ట సంచి వితరణ యంత్రాన్ని సోమవారం మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులను నివారించి, పర్యావరణాన్ని పరిరక్షించే క్రమంలో యాజమాన్యం దీనిని ప్రారంభించినట్లు తెలిపారు. రూ. 5 చెల్లిస్తే ఈ యంత్రం ద్వారా బట్ట సంచిని పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ ప్రతినిధులు వినీల్, అశోక్, సుశీల్, మిల్లు సిబ్బంది ప్రవీణ్‌కుమార్, మధుసూధన్, పద్మారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బడీడు పిల్లల్ని ప్రభుత్వ బడిలో చేర్పించాలి

ఆదిలాబాద్‌టౌన్ : బడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం గుడిహత్నూర్ మండలంలోని సీతాగొంది, మన్నూర్, ఇచ్చోడ మండలంలోని జామిడి, అడిగామలలో జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా సెక్టోరల్ అధికారి నారాయణ మాట్లాడుతూ మన ఊరు మన బడి వంటి పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించబడుతున్నాయన్నారు. అదేవిధంగా యూనిఫాం, పాఠ్య పుస్తకాలతో పాటు ఈ విద్యా సంవత్సరం నుంచి నోటు పుస్తకాలు కూడా అందించనుందన్నారు. తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రతిరోజు పాఠశాలలో చేరిన విద్యార్థుల సంఖ్య పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించరు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సుజాత్‌ఖాన్, ఆయా మండలాల విద్యాధికారులు ఆర్.నారాయణ, ఉదయ్‌రావ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పత్తి విత్తనమేదీ..?

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- మార్కెట్‌లో సరిపడా లభించని రాసి-659రకం
- అవసరం లేని వాటిని అంటగడుతున్న వైనం
- విత్తనాలు దొరక్క అన్నదాతల్లో ఆందోళన

వేసవి దుక్కులు పూర్తయ్యాయి. ఖరీఫ్ పంట వేసేందుకు నేలలు సిద్ధమయ్యాయి. ఆకాశంలోనూ ఉరుములు..మెరుపులు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో రెండు, మూడు భారీ వర్షాలు కురిస్తే విత్తనాలు పెట్టేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. కానీ మార్కెట్‌లో విత్తనాలు లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించడం మూలంగా రైతులకు అవసరమైన విత్తనాలు లభించని పరిస్థితి ఉంది. ముఖ్యంగా రైతులు అధికంగా కోరుతున్న రాసి -659 రకం విత్తనాలు మార్కెట్‌లో తీవ్ర కొరత ఉంది. ఈ రకం విత్తనాలు కావాలంటే..అదనంగా మరో ఒకటి లేదంటే రెండు ప్యాకెట్లు ఇతర కంపెనీల రకం తీసుకోవాల్సిందేనని డీలర్లు హుకుం జారీ చేస్తున్నారు. ఇలా రైతులు కావాలని అడిగిన విత్తనాలు కాకుండా ఇతర కంపెనీల విత్తనాలను బలవంతంగా అంటగడుతున్నట్లు తెలుస్తోంది. ఖరీఫ్‌లో సరిపడా విత్తనాలు ఉన్నాయని చెప్పిన అధికారులు సైతం ఈ సమస్యపై దృష్టిసారించడం లేదు. ఫలితంగా అవసరమైన విత్తనాలు దొరక్కపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఖరీఫ్ కాలం ముంచుకొస్తుండటంతో అన్నదాతలు విత్తనాల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. గత కొన్ని రోజులుగా జిల్లా, మండల కేంద్రాల్లో విత్తన దుకాణాలు రైతులతో కళకళలాడుతున్నాయి. అధికారులు సైతం రానున్న ఖరీఫ్‌కు సంబంధించి అన్ని విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పడంతో ఆనందం వ్యక్తం చేసిన అన్నదాతలు కొనుగోలు కోసం దుకాణాలకు వెళ్తున్నారు. జిల్లాలో రానున్న ఖరీఫ్‌లో 3.57లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగనుకానుంది. ఇందుకు జిల్లాకు సుమారు 8.50లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇప్పటి వరకు 8లక్షల ప్యాకెట్ల విత్తనాలు వచ్చాయని చెబుతున్నారు. కానీ అక్కడ వారికి అవసరమైన విత్తనాలు లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రైతులు వారి నేలల స్వభావాన్ని బట్టి వారికి అవసరమైన విత్తనాలను ఎంచుకుంటారు. ఇందులో భాగంగా అధికమంది రైతులు రాసి-659రకం విత్తనాలు కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ రకం విత్తనాలతో మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు కాయ పెద్దగా ఉంటుందనే ఉద్దేశంతో వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. కానీ మార్కెట్‌లో ఈ విత్తనాలు సరిపడా లభించడం లేదు. ఈ రకం విత్తన ప్యాకెట్ ఒకటి తీసుకుంటే.. ఇతర కంపెనీలకు చెందిన విత్తన ప్యాకెట్లు అదనంగా రెండు తీసుకోవాలని డీలర్లు స్పష్టం చేస్తున్నారు. ఇతర కంపెనీల విత్తనాలు తీసుకుంటేనే 659 రకం అందజేస్తున్నామని చెబుతుండటంతో గత్యంతరం లేని పరిస్థితిలో వాటిని తీసుకోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. కొందరు వ్యాపారులు ఈ రకం పత్తి విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి పొరుగు రాష్ట్రం వారికి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా రైతులకు సరిపడా విత్తనాలు లభించకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. విత్తనాల విక్రయాలపై నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ దిశగా దృష్టిసారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవసరం మేరకు విత్తనాలు ఉన్నాయి : పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్



జిల్లాలో రానున్న ఖరీఫ్‌లో సాగయ్యే పత్తి పంట కోసం సుమారు 8.50లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయి. ఇప్పటికే 8లక్షల వరకు ప్యాకెట్లు ఉన్నాయి. మిగితావి రావాల్సి ఉంది. ప్రస్తుతం విత్తనాల కొరత లేదు. ఎక్కువ మంది రైతులు రాసి 659రకం విత్తనాలు అడుగుతున్నారు. జర్మినేషన్ తక్కువ రావడంతో ఈ సారి ఈ రకం విత్తనాలు కొంత తక్కువగా వచ్చాయి. ఒకే రకం వేసిన తర్వాత నష్టపోతే ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో డీలర్లు ఇతర విత్తనాలు కూడా ఇస్తున్నట్లు తెలిసింది. రైతులకు అన్ని రకాల విత్తనాలపై అవగాహన కల్పిస్తున్నాం.

రైతులకు కొరత లేకుండా అందించాలి : బండి దత్తాత్రి, రైతు సంఘం నాయకుడు



జిల్లాలో రైతులు అడిగిన విత్తనాలు సరిపడా అందుబాటులో ఉంచాలి. రాసి-659 రకం విత్తనాలు రైతులు అడిగినవన్ని అందించాలి. అవసరమైన విత్తనాలు పంపిస్తామని కంపెనీ వారు కూడా హామీనిచ్చారు. వచ్చిన విత్తనాలు తొలుత స్థానిక రైతులకు అందించాలి. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి. కొరత సృష్టించకుండా చర్యలు తీసుకోవాలి.

పరీక్ష రద్దు చేయాలని ఆశా వర్కర్ల ధర్నా

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



ఆశా వర్కర్లకు కొత్తగా పరీక్ష పెట్టి అర్హత సాధిస్తేనే కొనసాగిస్తామని ప్రభుత్వం కొత్తగా నిబంధన పెట్టడాన్ని నిరసిస్తూ సోమవారం ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. కాగజ్‌నగర్‌లోని సీహెచ్‌సీ, మండలంలోని నజ్రుల్‌నగర్ పీహెచ్‌సీల ముందు ఆశా వర్కర్లు ధర్నా చేపట్టి అనంతరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారాం, వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో 32 ఏళ్లుగా, మైదాన ప్రాంతాలలో 18 ఏళ్లుగా ఆశా వర్కర్లు విధులు నిర్వర్తిస్తున్నారని, వీరు ప్రభుత్వపరంగా శిక్షణ పొంది ఉన్నా ఇపుడు కొత్త నిబంధన తీసుకురావడం సరైంది కాదన్నారు. ఆశాలకు నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంతో పోలిస్తే ఇపుడు ఆశా వర్కర్లకు పనిభారం పెరిగినందున వీరి పారితోషికాలను రూ, 9,750 నుండి రూ. 18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు జ్యోతి, లక్ష్మి, సురేఖ, మాధవి, జల్పన, సుజాత, మీనతి, స్వరూప, మీన పాల్గొన్నారు.



కౌటాల : ఆశా వర్కర్లకు పరీక్షను రద్దు చేయాలని సోమవారం పీహెచ్‌సీ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడారు. ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనం అందించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్యాధికారి నవతకు పలు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల మండల కన్వీనర్ మోగ్ర, నాయకులు మమత, లక్ష్మీ శాంత, పెంటక్క, సునీత పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. ముందుగా సంఘం నాయకులు కార్మికులతో కలిసి కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సర్వే నెంబర్ 170లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, చిలక దేవిదాస్, కుంటల రాములు, రమేష్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ హయాంలో పల్లెలకు కరెంట్ కష్టాలు దూరం

నవతెలంగాణ-ఖానాపూర్



తెలంగాణ ప్రభుత్వ హయాంలో పల్లెలు కరెంటు కష్టాలు దూరం చేసిన ఘనత సీఎం కేసీఆర్ దక్కుతుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని జెకె ఫంక్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్ర పాలనలో తెలంగాణ పల్లెలు కరెంటు కష్టాలతో అంధకారంలో తల్లడిల్లేవన్నారు. కానీ నేడు స్వరాష్ట్ర సాధన తర్వాత రాష్ట్రంలో నూతన పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఆధునిక కేంద్రాలు ఏర్పాటు చేసుకొని 24గంటల కరెంటును అందిస్తున్నామన్నారు. రైతులకు 24గంటల కరెంటు అందజేస్తూ ఎండాకాలంలో కూడా పంట పొలాలు పచ్చగా కనబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ విద్యుత్ అధికారులు డి.నాగరాజు, కె.శ్రీనివాస్, ఈ.తిరుపతి, టి.సుమన్‌కుమార్, సాయికిరణ్, జి.వెంకటేష్, శ్యాంసుందర్, టి.నాగరాజు, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, పుప్పాల శంకర్, ప్రదీప్, పుప్పాల గజేందర్ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో నేడు సురక్ష దినోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో 6న ఉదయం 9గంటలకు సురక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భారీ ర్యాలీ ఏర్పాట్లను ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంరక్షణలో, ప్రజలకు కల్పిస్తున్న వివిధ రకాల సేవలకు సంబంధించి 14రకాల పర్టికల్స్‌పై భారీ శకటాలతో, జిల్లాకు కేటాయించిన డయల్ 100, పెట్రో కార్, షీ టీం వాహనాలతో పట్టణంలోని ప్రధాన కూడళ్లను అనుసరిస్తూ భారీ ర్యాలీకి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో డయల్ 100, షి టీం, రిసెప్షన్, క్లూస్ టీం, పెట్రో కార్, సైబర్ క్రైమ్, క్యూఆర్టి, స్పెషల్ పార్టీ లాంటి అంశాలపై పూర్తి అవగాహనతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి శకటాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. తదుపరి సురక్ష దినోత్సవంలో భాగంగా సాయంత్రం 7గంటలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పోలీసుల సమక్షంలో కళాజాత బృందాలతో పోలీసులకు ప్రభుత్వం కల్పించిన అంశాలపై ప్రదర్శనలు, ఫొటో ఎగ్జిబిషన్, పది సంవత్సరాల్లో వివిధ రంగాలలో ఉన్నతమైన సేవలు అందించిన పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిఎస్పి వి.ఉమేందర్, సీఐ కె.సత్యనారాయణ, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ డి. వెంకటి, ఎం శ్రీపాల్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొందాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రయివేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత సదుపాయాలు కల్పిస్తు విద్యాబోధన జరుగుతుందని అందుకని ఇంటర్‌లో ప్రవేశం పొందాలని కళాశాల అడ్మిషన్ ఇంచార్జి బాలాజీ కాంబ్లే అన్నారు. సోమవారం సేక్కుగూడ గ్రామంలో పదో తరగతి పాసైన విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. పూర్వ విద్యార్థులతో కలిసి విద్యార్థులు పోషకులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందేందుకు తగు సూచనలు చేశారు. ప్రభుత్వ కళాశాలలో ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా ప్రవేశాలు పొందవచ్చని, ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ కూడా అందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవం గల అధ్యాపకులతో నాణ్యమైన విద్యా బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు, పోషకులు ఆలోచించి ప్రైవేటు యాజమాన్యానికి డబ్బులు పెట్టకుండా ప్రభుత్వ కళాశాలలో చేరి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. అడ్మిషన్ డ్రైవ్‌లో కళాశాల సిబ్బంది ఎల్.సుజాత, డి.సుజాత, గజానంద్ గ్రామపటేల్ మడావి మల్కు పాల్గొన్నారు.

వాగ్దేవి సొసైటీ సిబ్బంది స్వచ్ఛ భారత్



నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆలయానికి చెందిన వాగ్దేవి సొసైటీ సిబ్బంది స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆలయ పరిసరాలను శుభ్రపరిచారు. లడ్డూ పులిహోర ప్రసాద టికెట్ కౌంటర్, క్యూలైన్, వసతి గదుల పరిసరాలలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. సిబ్బంది స్వచ్ఛభారత్‌ను ఆలయ ఈవో విజయరామారావు పరిశీలించారు. నెలలో రెండు సార్లు ఆలయ పరిసరాలను శుభ్రపరిచేందుకు సిబ్బంది ముందుకు రావడం సంతోషమన్నారు. కార్యక్రమంలో సుమారు 80 మందికి పైగా వాగ్దేవి సొసైటీ సిబ్బంది స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఘనంగా రిమ్స్ డైరెక్టర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ జన్మదిన వేడుకలను సోమవారం రిమ్స్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైద్య సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేశారు. కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రిమ్స్‌లో నెలకొన్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దుర్గం ట్రస్టు చైర్మన్ దుర్గం శేఖర్, రిమ్స్ వైద్య సిబ్బంది ఉన్నారు.

నకిలీ విత్తనాలు అరికట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఎక్కువగా పండించే పత్తి, సోయా, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గ్రామీణ ఆదివాసీ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల కంపెనీ ఏజెంట్లు అమాయక ఆదివాసులకు మాయమాటలు చెప్పి క్రయవిక్రయాలు జరుపుతున్నారని, వాటిని అరికట్టేందుకు వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ ప్రసాద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్‌రావ్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. అలాగే బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాన్ని కాపాడానికి చెట్లను నాటాలన్నారు. మానవుల మనుగడకు చెట్లు ఎంతో అవసరమని, దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదిలాబాద్‌లో అడవులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పెంచుకుంటే వాతావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. పర్యావరణ దినోత్సవం ఒక్క రోజు కాకుండా నిత్యం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శివప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల జైన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ

నవతెలంగాణ-బేల

9సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మనియార్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రజలను కలిశారు. వరంగల్, సరూర్‌నగర్ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.4వేల నిరుద్యోగ భృతి, రైతులకు ఎకరాకు రూ.15వేల రైతుబంధు ఇస్తామన్నారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులకు పింఛన్ అందించే కార్యక్రమం చేపడుతుందన్నారు. చనాక-కోర్ట ప్రాజెక్టును రెండు సంవత్సరాల్లో పూర్తి చేసి రైతులకు నీరందిస్తామని చెప్పి 5 సంవత్సరాలు గడుస్తున్న పూర్తి చేయలేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత, మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, వామన్ వాంఖడే, గావండే ఘన శ్యామ్, రాక్రె విపిన్, శంకర్ భోక్రే, అవినాష్, సీతారాం పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ కోసం రికార్డులతో కుస్తీ

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో మండలంలో రెండు సంవత్సరాల క్రితం జరిగిన పనులు రికార్డులు సామాజిక తనిఖీ నిర్వహించడానికి సోషల్ ఎడిట్ బృందం వస్తుందని తెలియజేయడంతో ఉపాధి హామీ సిబ్బంది పెండింగ్ రికార్డులు, మాస్టర్ రోల్, ఎంబి బుక్‌లతో కుస్తీ పడుతూ బిజీ బిజీగా ఉన్నారు. పని ప్రదేశంలో కూలీలు పని చేసిన రికార్డులు మాస్టర్, పేమెంట్ ఆర్డర్, ఎంబి బుక్, వర్క్ ఐడి, ఎస్టిమేషన్ కాపీలు జతచేస్తూ పని పూర్తయిన తర్వాత సంబంధిత అధికారికి టెక్నికల్ అసిస్టెంట్ ఆ పని పూర్తి రికార్డు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మండలంలో అలా జరగకుండా ఆడిట్ బృందం వస్తుందని తెలియడంతో ఆ పనికి సంబంధించిన పెండింగ్ పనులను ప్రస్తుతం పూర్తి చేస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు వేరే మండలానికి బదిలీ అవ్వడంతో ప్రస్తుత ఆడిట్లో రికార్డులు తయారు చేయడానికి మండలానికి వచ్చి ఎంబి బుక్‌లో సంతకాలు కొలతలు రాస్తున్న సమయంలో రిపోర్టర్లు వెళ్లగా ఆ పనిని అక్కడికి ఆపేశారు. ఇప్పుడు సంతకాలు ఎందుకు చేస్తున్నారని వివరణ తీసుకోగా రికార్డులు చెక్ చేసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రికార్డులు ప్రస్తుతం తయారు చేయడంతో పని ప్రదేశాల్లో పనులు జరిగాయా? సిబ్బంది చేతివాటం చూపించారా? అనే కోణంలో తనిఖీ బృందాలు చూడాల్సి ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులను అభినందించిన డీఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డ్రాపవుట్ విద్యార్థులుగా యుఆర్ఎస్(అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్)లో చేరి గురుకులాలు, మోడల్ స్కూల్లో సీట్లు సాధించడం హర్షనీయమని జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత అన్నారు. సోమవారం తన ఛాంబర్ లో విద్యార్థులకు డిక్షనరీలు అందజేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా యుఆర్ఎస్ ప్రత్యేక అధికారి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులను అభినందించారు. రవి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, నితిన్, గజానంద్ గురుకులానికి, చరణ్ నాయక్ మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యారని సెక్టోరల్ అధికారి కంటే నర్సయ్య తెలిపారు. నిరుపేద, డ్రాపవుట్, అనాథ బాలురు ఉంటే బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాలన్నారు. ఉచిత బోధన, హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని డీఈవో సూచించారు. కార్యక్రమంలో సీసీ రాజేశ్వర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆస్తమా నిర్మూలనకు 8న ఉచిత మందులు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఈ నెల 8న ఆస్తమాకు ఉచితంగా మాత్రలను పంపిణీ చేస్తామని ఆయుర్వేద వైద్యుడు యువరాజ్ పేర్కొన్నారు. ఆయుర్వేదిక్ రిసోర్స్ సెంటర్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. వివరాలకు 9440247332 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

11న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష సంబంధించిన సందేహాలు, సలహాలు ఇతర వివరాలకు అభ్యర్థులు ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 18004251939ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుంటాల జలపాతం వద్ద సోమవారం సిరిచెల్మ రేంజ్ అధికారి వాహబ్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జలపాతం చుట్టూ పక్కల పేరుకు పోయిన ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లను తొలిగించారు. ఈ సందర్భంగా అయన పర్యాటకులకు పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిరిచెల్మ డిప్యూటీ రేంజ్ అధికారి అమర్ సింగ్, కుంటాల సెక్షన్ అధికారి వసంత్ కుమార్, ఎఫ్‌బీఓ సచిన్, సందీప్, సంతోష్, గజ ఈతగాళ్లు, వాచర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట గ్రామస్తుల నిరవధిక దీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తాంసి మండలం పొన్నారి గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరవధిక దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గంగన్న మాట్లాడుతూ పొన్నారి గ్రామ సమీపంలో వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని, అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేను కలిసిన పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామ సమస్యలపై ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.



తడిసిన ధాన్యాన్ని కోత విధించకుండా తీసుకోవాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

తడిసిన వరిధాన్యం కొనుగోలు చేయాలని రైతులు చేస్తున్న ధర్నాకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద ఎన్ హెచ్ 61 రహదారిపై సోమవారం బీజేపీ పార్టీ శ్రేణులు, రైతులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విరేష్ కుమార్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వీలైనంత త్వరలో గోదాములకు తరలించాలని అన్నారు. బస్తాలు లారీలో తరలింపు కొరకు రైతుల వద్ద బస్తాకు రూ.15 వసూలు చేయడం ఆపాలని అన్నారు. కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని వెంటనే తరలించకపోవడంతో అకాల వర్షాలకు తడిసి రైతులు నష్టాలకు గురి కావడం జరుగుతుందని అన్నారు. ఆదివారం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. తూకం చేసిన తరువాత ధాన్యాన్ని తరలించేందుకు రైతులే వాహనాలు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూకం వేసిన సంచులను సొసైటీ కొనుగోలు కేంద్రం వారే వెంటనే వాహనాల్లో తరలించాలని కోరారు. ధర్నా స్థలానికి ఎస్సై గంగాధర్ చేరుకుని ఎంత సర్దిచెప్పిన ధర్నా విరమించక పోవడంతో డీసీఓతో ఫోన్‌లో మాట్లాడి మూడు, నాలుగు రోజులలో ధాన్యం మొత్తం తూకం వేసి లారీలలో తరలిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు వీరేష్ కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు శైలేశ్వర్, నాయకులు ముత్యంరెడ్డి, ఉమాశంకర్, రాజు, రమేష్, సాయి, శ్రీనివాస్, అనిల్, మూరేష్, చక్రధర్, సుధాకర్, ముత్యం, రాకేష్, వినోద్, మనీష్, ప్రవీణ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

భూసంబంధ సమస్యలను ధరణిలో దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భూ సంబంధ సమస్యలను మీసేవ కేంద్రాల ద్వారా ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, నిబంధనల మేరకు పరిష్కరించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అన్నారు. భూ సంబంధ సమస్యలను ధరణి పోర్టల్‌లోని వివిధ మాడ్యూల్‌ల ద్వారా పరిష్కరించుకోవచ్చని, అర్జీదారులు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసంబంధ, ఫించన్, ఉపాధి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు, తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను దరఖాస్తుదారులు అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు వర్తింపజేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఖానాపూర్ నియోజక వర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు పథకం అందించాలని ఏబీసీ రీసెర్చ్ డైరెక్టర్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయంలో వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సర్కార్ దళితబంధుకు పూర్తి బడ్జెట్‌ను కేటాయించాలని అన్నారు. కేవలం కమిషన్‌లు ఇచ్చిన వారికే అరకొర దళితబంధును ఇచ్చి మోసపూరిత ప్రచారాలు మానుకోవాలని సూచించారు. ఇప్పటికైనా ఖానాపూర్ పాలకులు నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి ఈ పథకం కింద గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల ఆధ్వర్యంలో అప్లికేషన్‌ను నింపి స్థానిక. తహసీల్దారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, పెందోర్ ప్రభాకర్, పుర్క బాపురావ్ పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ నిధి పథకంలో చేరుదాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సభ్యుల సంక్షేమం కోసం ప్రారంభించిన "కుటుంబ సంక్షేమ నిధి" పథకంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో చేరాలని టీఎస్‌యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎ స్వామి, వి.అశోక్ అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కరి కోసం అందరం, అందరికోసం ఒక్కరం, అనే నినాదంతో యూటీఎఫ్ కుటుంబ సభ్యులకు భరోసానిచ్చేందుకు ప్రారంభించిన కుటుంబ సంక్షేమ నిధి పథకం ఉపాధ్యాయులకు చాలా ఉపయోగకరమని అన్నారు. ఈ పథకంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో చేరాలని వారు కోరారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు టి సూర్య కుమార్, కోశాధికారి కె కిష్టన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు సి.లక్ష్మణ్ రావ్, జిల్లా కార్యదర్శులు కె శ్రీనివాస్, సి.విలాస్, శివన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో స్వచ్ఛత కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది బస్టాండ్ పరిసరాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఏం కల్పన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ విశ్వనాథ్, ఎంఎఫ్ సీ రాజేందర్, ఎస్ఎం రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కోతల దుస్థితి నుంచి కాంతి వెలుగుల వరకు

● ఘనంగా విద్యుత్ దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత విద్యుత్ రంగం గుణాత్మక మార్పు సాధించి, విద్యుత్ కోతల దుస్థితి నుంచి కాంతి వెలుగులతో రాష్ట్రంగా ప్రకాశిస్తోందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన విద్యుత్ దినోత్సవ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్, ఎమ్మెల్యేలు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్ర ప్రగతిలో అత్యంత కీలకమైన విద్యుత్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన సంస్కరణలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సాధించిన విజయాల ప్రగతి నివేదికను ఎస్ఈ సంపత్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రం నిరంతర విద్యుత్ కొరకు తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతి, సోలార్, హైడల్, థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్ వ్యవస్థ బలోపేతం, తదితర అంశాలపై వీడియో ద్వారా సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యుత్ విజయోత్సవల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యాపార, పరిశ్రమలలో ఉత్పత్తి పెరిగి ఎందరికో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. గతంలో 7778 మెగావాట్లు కాగా ప్రస్తుతం 18567 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పెరిగిందన్నారు. జిల్లాలో ఒక లక్ష 47 వేల మంది రైతులకు రైతుబంధు ఇవ్వడంతో పాటు పంటల సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఏజెన్సీలోని 600 ఆవాసాలకు విద్యుత్ సరఫరాతో పాటు సోలార్ కనెక్షలు ఇవ్వడం జరిగిందని అన్నారు. రజకులకు, నాయి బ్రాహ్మణులకు నెలకు 250 యూనిట్లు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్‌శాఖ సాధించిన ప్రగతిని వివరించడం జరుగుతుందని, గతంలో కరెంటు కోతలతో వ్యవసాయ రంగంతో పాటు పరిశ్రమలు మూతపడ్డాయని అన్నారు. నేడు 24 గంటల నిరంతరం విద్యుత్ సరఫరాతో రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తున్నదని తెలిపారు. విద్యుత్ శాఖ బలోపేతానికి కృషి చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న విద్యుత్ విజయోత్సవ కార్యక్రమంలో సందర్భంగా విద్యుత్ వినియోగదారులకు, రైతులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో అమరుల త్యాగాల పునాదులతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం 24 గంటల విద్యుత్ సరఫరాతో దేశంలోనే గొప్ప ఖ్యాతిని సాధించిందని అన్నారు. అందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, విద్యుత్ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కళాకారులు విద్యుత్ వినియోగం, అభివృద్ధి పై పాటలు, నృత్య రూపకంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీపీ గోవర్ధన్, డీఈ సుభాష్, ప్రజాప్రతినిధులు, రైతులు, వినియోగదారులు, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దళారులను నమ్మి మోసపోవద్దు

● ఎమ్మెల్యే రేఖా నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

రైతులు కష్టపడి పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే రేఖా నాయక్ సూచించారు. సోమవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలోని సబ్ మార్కెట్ యార్డులో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న పంటల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రేఖా నాయక్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జొన్న పంటను ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకి రూ.2,970లకి రైతుల వద్ద కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న పంట విస్తీర్ణం ప్రకారం ఒక ఎకరానికి 08 క్వింటాళ్ల చొప్పున సేకరించడం జరుగుతుందని తెలిపారు. రైతులు తమ జొన్నలను అధిక తరుగు, అధిక తేమ లేకుండా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకొని మార్కెట్‌కి తీసుకుని రావాలని అన్నారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉందని పంటలను అమ్ముకునేందుకు మార్కెట్ వచ్చే సమయంలో రైతులు టార్పాలిన్లు తెచ్చుకోవాలని కోరారు. ఇలాంటి అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మెన్ ఎస్పీరెడ్డి, వైస్ ఎంపీపీ బాలాజీ, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్, నాయకులు, అధికారులు ఉన్నారు.

ఆర్జీయూకేటీ యూజీ అడ్మిషన్స్ ప్రారంభం

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో 2023-24 సంవత్సరానికి గాను ఆరు సంవత్సరాల బీటెక్ ప్రవేశాల కొరకు నోటిఫికేషన్ గతంలోనే యూనివర్సిటీ అధికారులు విడుదల చేశారు. సోమవారం ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవడానికి అప్లికేషన్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ నెల 19వ తేదీ వరకు విద్యార్థులు టీఎస్ ఆన్‌లైన్ మీ సేవ ద్వారా సర్టిఫికెట్ అప్లోడింగ్, ఫీ పేమెంట్ తదితర అంశాలతో కూడిన అప్లికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. స్పెషల్ క్యాటగిరి దివ్యాంగులు, ఎన్‌సీసీ, క్యాప్, స్పోర్ట్స్ కోట విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు పూర్తిచేసిన తదుపరి 24 జూన్ 2023 వరకు ఆర్జీయూకేటీ బాసరకు తమ అప్లికేషన్లను ప్రింట్ అవుట్ అందజేయాలని సూచించారు. విద్యార్థులకు హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. 7416305245, 7416058245, 7416929245 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

అడ్మిషన్ ప్రక్రియపై సమీక్షా సమావేశం...

ఆర్జీయూకేటీ బాసర పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డైరెక్టర్ సతీష్ కుమార్, వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రోజువారి అప్లికేషన్స్ సంఖ్యను, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకొని రోజువారి రిపోర్టును తెలియజేయాలని అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే ఆర్జీయూకేటీ బాసర స్వీకరిస్తుందని ఫీజు చెల్లింపులో ఎటువంటి మార్పు లేదని తెలిపారు. అడ్మిషన్ ప్రక్రియలో నాలుగు గ్రూప్‌లలో ఆయా అధికారులు పని చేస్తారని, ఇందులో 50 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ విద్య సంవత్సరం నుంచి సెమిస్టర్ రిజిస్ట్రేషన్ ప్రతి విద్యార్థి చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు ఈనెల 20వ తేదీన విశ్వవిద్యాలయాల్లో విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో అడ్మిషన్స్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రావు, కోఆర్డినేటర్ పావని, దత్తు, టెక్నికల్ టీం సభ్యులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నార్నూర్

నవతెలంగాణ-నార్నూర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు మానే సత్యవర్ధన్, వాగ్మారే భావ్‌రావ్ అన్నారు. సోమవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామపంచాయతీ పల్లె ప్రకృతి వనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంబరాలకు 50 ఏండ్లు పూర్తయ్యాయని తొలిసారిగా స్వీడన్‌లో 1972వ సంవత్సరం ఐక్యరాజ్యసమితి నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ సదస్సులో వాతావరణ మార్పులను గమనిస్తూ తగు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని గుర్తు చేశారు. 1973 నుంచి జూన్ 5న ప్రతియేటా ప్రపంచ పర్యావరణ దినం విశ్వవ్యాప్తంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఐరాస ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (యూఎన్‌ఈపీ) ఏటా ఏదో ఒక అంశంతో పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు చేస్తూవస్తోందని అన్నారు. ఈ సారి 'ఓన్లీ వన్ ఎర్త్' థీమ్‌తో పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా ప్రయత్నించాలని అన్నారు. గ్రీన్‌లైఫ్ స్టైల్‌ను అలవర్చుకోవడంతో పాటు పచ్చదనం, పరిశుభ్రతల కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ షడ్ విష్ణు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు మోతిరాం, గోపాల్, నర్సరీ నిర్వహకులు దేవుజీ, శ్యామ్ రావ్, దీపక్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ఖానాపూర్ రూరల్: ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను నాటి వాటిని సంరక్షించడం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే రేఖ నాయక్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఖానాపూర్ అటవీ క్షేత్రాధికారి వినాయక్ ఆధ్వర్యంలో అర్బన్ పార్క్ వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మొక్కల ప్రాధాన్యతపై ఎమ్మెల్యే వివరించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన గాలి పీల్చుకోవాలంటే తాను నివసించే పరిసరాల్లో పచ్చదనం పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్‌తో పాటు అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పర్యావరణం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ జగ్‌రామ్ అంతర్వేది హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ సమతుల్యానికై పచ్చదనం, ఆవశ్యకతను వివరించారు. అలాగే చెట్ల పెంపకం అవసరాన్ని గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ ఎం.నర్సింగారావు, జటంగుల విజయ్ కుమార్, డి.దయాకర్, అష్రఫ్ అలీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాసర: ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పరిపాలన కార్యాలయం సమీపంలో వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ మాట్లాడుతూ మన ఆర్జీయూకేటీ మన బాధ్యత నినాదంతో పలు కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. వాతావరణ మార్పులు ఇప్పుడు మానవ జీవితాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయని ప్రధానంగా మానవ తప్పిదాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని అన్నారు. 19వ శతాబ్దం కంటే ప్రపంచం ఇప్పుడు ఒకటి పాయింట్ ఒకటి డిగ్రీ సెంటీగ్రేడ్ వేడిగా ఉందని, భవిష్యత్తులో గ్లోబల్ వార్మింగ్ నాలుగు డిగ్రీ సెంటీమీటర్లు మించిపోతుందని శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు జీవన విధానంలో ప్లాస్టిక్ దూరంగా వుంటూ, చెట్ల పెంపకంపై దృష్టి సారిస్తే వాతావరణంలో మార్పుల ప్రభావాన్ని పరిమితం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్

కూలిబంధు పథకాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధి హామీ పథకంలో పాత పద్ధతినే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ నటరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు కోతలతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.272 ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలిబంధు పథకాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రతి రోజు రెండు పూటల సమయాల్లో ఫోటో తీసే కార్యక్రమాన్ని రద్దు చేయాలని అన్నారు. ఆయన వెంట సంఘం జిల్లా అధ్యక్షులు స్వామి, నాయకులు ఆశన్న, శంకర్ పాల్గొన్నారు.

మండల రైతులకే విత్తనాలు అమ్మాలి

నవతెలంగాణ-బేల

మండలంలోని విత్తన దుకాణాలను, గోడౌన్లను మండల వ్యవసాయ అధికారి వెండి విశ్వామిత్ర సోమవారం వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా రిజిస్టర్ బిల్లు బుక్‌లను వారికి వివిధ కంపెనీల నుంచి వచ్చిన విత్తన నిల్వలు, అమ్మకం గురించి ఆరా తీశారు. రైతులకు బిల్లులను పూర్తి వివరాలతో లాట్ నెంబర్, రైతు వివరాలు, రైతు సంతకంతో ఇవ్వాలని సూచించారు. లేనిపక్షంలో విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. స్టాక్ వివరాలను ప్రతిరోజు బోర్డుపైన రాయాలని సూచించారు. డిమాండ్ ఉన్న పత్తి రకం, ఇతర కంపెనీల విత్తన రకం వివరాలను ఆరా తీశారు. స్థానికంగా డిమాండ్ కలిగిన పత్తి రకాలు ఎటువంటి షరతులు లేకుండా మండల రైతులకు మాత్రమే విక్రయించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల రైతులకు స్థానికంగా డిమాండ్ ఉన్న విత్తనాలను అమ్మరాదని హెచ్చరించారు. ప్రతి నెల తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో విత్తన నిల్వలను, విత్తన నమూనాలను తీసి విత్తన నాణ్యత ప్రమాణాల కొరకు ల్యాబ్‌కు పంపించారు. ఈ తనిఖీల్లో ఏఓ వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఉమర్, నగేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు రైతుల కష్టాలు కనపడటం లేదా ?



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా రైతులకు అవసరమైన విత్తనాలు దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒకవైపు రైతుల విత్తనాల కోసం పడిగాపులు కాస్తుంటే జిల్లాకు వచ్చిన విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. అలాగే రాష్ట్రాన్ని విత్తన బాండాగారంగా చెప్పుకునే బీఆర్ఎస్ నాయకులకు రైతుల కష్టాలు కనపడటం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకొని ఎకరాకు రూ.10వేలు రైతుబంధు ఇచ్చి రైతులకు అందాల్సిన సబ్సిడీ లు ఇవ్వకపోవడంతో రైతుపై రూ.20వేలు అదనపు భారం పడుతుందని, రైతుబంధు కేవలం భూస్వాములకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతులకు మాత్రం రైతుబంధు, రైతు భీమా ఇవ్వడం లేదని అన్నారు. చివరికి పంట అమ్ముకోవడానికి కూడా ఆంక్షలు పెడుతున్నారని అన్నారు. ఇకనైనా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైల్వే బోర్డ్ మెంబర్ జీవీ రమణ, నాయకులు గటిక క్రాంతి కుమార్, సంతోష్ కొత్తపెల్లి, కాంత, నరేష్ తోకల, రాము గెడం, ముఖీమ్, అరిఫ్, గణేష్ ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవా కార్యక్రమాలు అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవా కార్యక్రమాలు అభినందనీయం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల అనతి కాలంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన మార్పు సాధించిందని అన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ మెడికల్ కళాశాలలను మంజూరు చేసుకుని వైద్యుల కొరత రాకుండా ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తోందని తెలిపారు. గతంలో ఆస్పత్రుల్లో సరైన వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటూ వేడుకోలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తనకు న్యాయం చేసి తన పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటూ వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామానికి చెందిన కోలే సక్కయ్య వేడుకున్నాడు. ప్రజావాణిలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం విద్యుత్ శాఖకు చెందిన ఒక వ్యక్తికి రూ.40 వేలు అందజేశానని అయినప్పటికీ తన పక్కన ఉన్న వారికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తన పొలానికి ఇవ్వలేదన్నారు. కనెక్షన్ ఇవ్వకపోవడం పట్ల పలుమార్లు అడిగినప్పటికీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల నుండి విద్యుత్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ లాభం లేకుండా పోయిందని ఆవేధన వ్యక్తం చేశారు. దీంతో కూరగాయలు పండిస్తున్న తాను ఇబ్బంది పడాల్సిన వస్తుందని అన్నారు. వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయంపై విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్‌ని వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేవాపూర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నవతెలంగాణ-కాసిపేట

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఓరియంట్ సిమెంట్ కర్మాగారం ఆధ్వర్యంలో దేవాపూర్‌లో సోమవారం వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచేసినటువంటి ఓరియంట్ సిమెంట్ యొక్క యూనిట్ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహేంద్ర ప్రతాప్ జోషి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జీవకోటికి ప్రాణాధారమైన మొక్కలు పెంచటం ద్వారా, ప్రత్యమ్నాయ ప్లాస్టిక్ వస్తువులను నిషేదించటంతో పెరిగిపోతున్న భూమండల ఉష్ణగ్రతలను తగ్గించవచ్చని, సుస్థిర అభివృద్ధిని సాధించవచ్చన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ అవగాహన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్‌లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

- సీఎస్ఆర్ నిధులతో మౌళిక వసతులు కల్పించాలి
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సింగరేణి డైరెక్టర్ బలరామ్ నాయక్‌తో కలిసి జైపూర్ ఎస్టీపీపీలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం 1200 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో కొనసాగుతున్న ఎస్టీపీపీ అనుబంధంగా సింగరేణి యాజమాన్యం మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నందున స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని అన్నారు. అదేవిధంగా విద్యుత్ ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో మౌళిక వసతులు కల్పనకు సహకరించాలని కోరారు. ప్లాంట్ పరిధిలో చిన్నా చితక కాంట్రాక్టు పనుల విషయంలో స్థానికులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సంధర్భంగా సింగరేణి ప్రగతి నివేదన పుస్తకాన్ని డైరెక్టర్ బలరామ్ నాయక్‌తో పాటు స్థానిక ప్లాంట్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. దీనికి ముందు పవర్‌ప్లాంట్ నిర్వాహణ, ఉత్పత్తి తీరు తదితర విషయాలపై ప్లాంట్ అధికారలు విప్ సుమన్‌కు ప్రత్యక్షంగా వివరించారు. సంస్థ అభివృద్ధికి చిహ్నంగా శాంతి కపోతాలను ఎగురవేసిన అధికారులు ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను శాలువాతో సన్మానించారు.

బూత్ కమిటీలను బలోపేతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో బీజేపీ శక్తి బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్లో బీజేపీ మండల ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ఫంక్షన్ హాల్ వరకు ద్విచక్ర వాహనాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటింటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం వల్ల పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బేరవెల్లి రఘునాథరావు, మండల అధ్యక్షుడు గోలి చందు, ఎంపీటీసీ కొంతం శంకరయ్య, సీనియర్ నాయకులు గుండవరపు మధుసూదనరావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రి నాయక్, మొహమ్మదాబాద్ సర్పంచ్ సునార్కర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానికి తరలివచ్చిన కూలీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానం ఉంటేనే డబ్బులు ఖాతాలో జమ అవుతాయని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో సోమవారం మండలంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒక దశలో వారిని నివారించడం పోస్ట్ ఆఫీస్ సిబ్బందికి కొంత ఇబ్బందిగా మారింది. అందరూ ఒకే రోజు కాకుండా రోజు కొంతమంది రావాలని సిబ్బంది సూచించారు. ప్రతి ఒక్కరు అనుసంధానం చేసుకోవాలని తెలిపారు.

కళాశాల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వెనుకబడిన తరగతుల బాలుర కళాశాల వసతి గృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆ వసతి గృహ సంక్షేమ అధికారి మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలతో పాటు, బీఈడీ, డైట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వసతి గృహంలో మొత్తం 80 సీట్లు ఉంటాయని ఆసక్తిగల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో వసతి గృహంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసేవారు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ సెట్ అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 6303250017, 7386577620 నెంబర్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 10వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ఎక్కువ రాజీ కేసులు వచ్చేలా చూడాలని దానిని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎంవీ. రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోర్టు హాల్‌లో సోమవారం పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన కార్యక్రమం నిర్వహించనున్నట్లు దీనికి ఎక్కువగా రాజీ కేసులు వచ్చేలా చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగు క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రి-లిటిగేషన్ కేసులు, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూతగాదా కేసులు, వివాహ/ కుటుంబ తగాదాల కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులు ఇతర రాజీపడదగు కేసులను పరిష్కరించ బడునని కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, సీఐలు నరేందర్, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని పోతెపెల్లి గ్రామంలో ఆరె కుల సంఘం ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శివాజీ అడుగుజాడల్లో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చాంద్రమౌళి, సంజీవ్, శ్రీనివాస్, జడ్పీటీసీ సరిత, తహసీల్దార్ సరిత, ఎస్సై విజయ్, ఎంపీడీఓ గంగాసింగ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షిఉంచుకునే భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎఫ్ఆర్ఓ కార్యాలయం నుంచి సబ్ జైలు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం పూర్తిగా కాలుష్యం అవుతుందన్నారు. దాన్ని తగ్గించడంలో ప్రతి వ్యక్తి ముఖ్యమైన పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. మానవ అవసరాలకు ఎప్పుడైతే ప్రకృతిని నాశనం చేయటం ప్రారంభించామో అప్పుడే పతనం ప్రారంభమైందని అన్నారు. చివరకు మానవ మనుగడే ప్రశ్నార్ధకం అయ్యే దశకు చేరబోతోందన్నారు. పరిశ్రమల నుంచి, వాహనాల నుంచి వచ్చే వ్యర్థాలు గాలిని, నీటిని, భూమిని, అంతరిక్షాన్ని అన్నింటిని కాలుష్యం చేస్తున్నవని తెలిపారు. వీటి నివారణ కోసం సాధ్యమైనంత వరకు మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కల వల్ల కావలసినంత ఆక్సిజన్ లభించడంతో పాటు పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు ప్రవీణ్ కుమార్, సరోజ రాణి పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు జిల్లా జడ్జ్ ఎం.వి. రమేష్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, ఏవో రత్నరాజు, అడ్వకేట్లు ఎం సురేష్, నరహరి పాల్గొన్నారు.



నస్పూర్ : ప్రకృతిని రక్షిస్తేనే మనిషికి మనుగడని ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ మాలోతు రాముడు అన్నారు. సోమవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్కే-7 గనిలో పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏజెంట్ మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడానికి అడవుల్ని పెంచాలని చెప్పారు. ప్రకృతిలో కాలుష్యం పెరగడం వలన మానవ జాతి కాకుండా, పక్షులు జంతువులు చాలావరకు అంతరించిపోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ సంతన్ , అండర్ మేనేజర్ రవీందర్, ఓవర్మన్‌లు ముజీబ్, సమ్మిరెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు డీకొండ అన్నయ్య, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ఆర్కే-7 గని ఫిట్ సెక్రటరీ మెండ వెంకటి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి కొట్టే కిషన్ రావు, పిట్ సెక్రెటరీ సారయ్య, వాలంటీర్లు రాజ్ కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

జన్నారం : మొక్కలే మానవ మనుగడకు జీవనాధారమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్, ఇంధన్‌పల్లి రేంజ్ ఆఫీసర్ ఆఫీసొద్దీన్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తిమ్మాపూర్, ఇందనపల్లి గ్రామంలో వేరువేరుగా ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్తా చెదారాన్ని ఏరి పారేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చెట్టు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామ సభ ఏర్పాటు చేసి, పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ గ్రామ కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు చంద్రయ్య, రాజన్న, వెంకట్ పాల్గొన్నారు.

కాసిపేట : అటవి రక్షణకు అందరూ పాటుపడాలని, రాబోయే కాలంలో అడవుల అభివృద్దే విపత్తుల నుండి కాపడగలదని బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుభాష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంకటపూర్ గ్రామ పంచాయతీలోని లక్ష్మీపూర్‌లో పర్యావరణ దినోత్సవ సందర్భంగా అడవుల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 19న హరితహారం కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యువతకు వాలీ బాల్ కిట్లను అందజేశారు. యువత మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి.ప్రవీణ్ నాయక్, ఆదివాసీ నాయకులు ప్రభాకర్, మల్లేష్, భీంరావు, వాచెర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాగజ్‌నగర్ డీఎల్పిఓ సురేష్ బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్ రెడ్డి, ఏపీఎం మోహన్ లాల్ పాల్గొన్నారు.



నస్పూర్‌లో..


జన్నారంలో..


కాసిపేటలో..

ఆశా వర్కర్లకు పరీక్ష రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశ వర్కర్లకు నిర్వహించ తలపెట్టిన పరీక్షను ప్రభుత్వం రద్దు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప డిమాండ్ చేశారు. మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన పరీక్షను రద్దు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలన్నారు. ప్రతి నెల రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలన్నారు. పారితోషికం లేని అదనపు పనులు చేయించకూడదన్నారు. టీబి, లెప్రసీ, కంటి వెలుగు పనుల డబ్బులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ ఏరియాస్ విడుదల చేయాలన్నారు. వెంటనే తమ డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు సుజాత, భారతి, సునీత, యశోద, అమృత, అరుణ, దేవిక పాల్గొన్నారు.

పెంచికల్ పేట్ : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ మణి విక్టోరియాకు ఆశా కార్యకర్తలు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలకు పరీక్షలు నిర్వహించా కూడదని, వేతనాన్ని పెంచాలని, అలవెన్సులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లక్ష్మీ రాజేశ్వరి, సుజాత, శిరీష, శ్రీలత పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం మండలంలోని లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించి వైద్యాధికారిని కృష్ణవేణి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం వెలిశాల క్రిష్ణమాచారి, కవిత, నాయకులు కేసర, శారదా, శాంత, నిర్మల ఇతర ఆశాలు పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్‌లో..

రోజువారి దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- ఎంపీపీ గోదారి రమాదేవీలక్ష్మణ్



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు రోజువారిగా ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్ కోరారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముదిగుంట గ్రామ పంచాయతీ అంగన్‌వాడి కేంద్రంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ 6 నెలల పిల్లలకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, వెల్‌బేబీ షో, గ్రోత్ మానిటరింగ్ నిర్ణీత రోజుల్లో కొనసాగించాలని సూచించారు. అంగన్‌వాడి కేంద్రాల పరిధిలో కౌమార బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిశుభ్రత, విద్య పట్ల ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. ఈ నెల 9న తెలంగాణ సంక్షేమ సంబురాలు, జూన్ 13న మహిళా సంక్షేమ దిన్సోవం కోసం కెటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూట జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వేజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

కోటపల్లి : చెన్నూరు మండలంలోని అంగ్రెజ్‌పల్లి సెక్టార్ పరిధిలోని దుగ్నేపల్లి, సుందరశాల నాగపూర్, అస్నద్ గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీలకు సోమవారం సామూషిక సీమంతాలు చేశారు. అలాగే 0-6 సంవత్సరాల పిల్లల బరువు, ఎత్తులను తూనిక వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రాజమ్మ, సుజాత, మాధవి, ఊర్మిళ, వనజారాణి పాల్గొన్నారు

సింగరేణిలో ఘనంగా దశాబ్ది సంబురాలు

నవతెలంగాణ-మందమర్రి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సింగరేణి సంబరాలను సోమవారం స్థానిక మందమర్రి ఏరియాలోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా బలరాం, మందమర్రి ఏరియా జీఎం జి.మోహన్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మొదటగా మందమర్రి జీఎం కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించి, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మందమర్రి ఏరియా సీఈఆర్ క్లబ్ నుంచి పోతరాజుల విన్యాసాలతో బతుకమ్మ కోలాటాల ఆటపాటలతో సింగరేణి ప్రగతి ర్యాలీని ఘనంగా నిర్వహించారు. సింగరేణి హై స్కూల్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ అమరుల వీరుల స్తూపాలకి నివాళ్లు అర్పించారు. సింగరేణిలో సాధించిన అద్భుత ప్రగతి ఫోటో ఎగ్జిబిషన్, ఎంవీటీసీ, ఆర్ఆర్టి, మెడికల్, సింగరేణి సేవ, తెలంగాణ రుచులు, స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తొమ్మిది సంవత్సరాలలో సింగరేణి ఎంతో అభివృద్ధి చెందిందని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చొరవతో కారుణ్య నియామకాల ద్వారా యువతకు ఉద్యోగాలు లభించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, మందమర్రి సేవ అధ్యక్షురాలు యశోద మోహన్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



నస్పూర్ : సింగరేణిలో దశాబ్ద కాలంలో అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి సాధించామని సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్, పా బలరాం అన్నారు. సోమవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణిలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొదట శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డైరెక్టర్ బలరాం సింగరేణి కార్మికుని విగ్రహానికి పూలమాల వేశారు. శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియా నుండి కళాకారులచే, ఆటపాటలతో సింగరేణి ప్రగతి రన్ నిర్వహించారు. ప్రగతి మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం సింగరేణి అభివృద్ధిని తెలిపే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు బోర్లకుంట వెంకటేష్ నేత, మంచిర్యాల శాసనసభ్యుడు నడిపెల్లి దివాకర్ రావు హాజరయ్యారు.

రామకృష్ణాపూర్ : ఆర్కే-1ఏ గని పై సోమవారం పర్యావరణ దినోత్సవం, తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గని ఇన్‌ఛార్జి మేనేజర్ దిలీప్ కుమార్ ముందుగా తెలంగాణ తల్లి చిత్ర పటానికి, తెలంగాణ అమరవీరుల స్థూపానికి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే కార్మికులకు పది సంవత్సరాలలో సింగరేణి సాధించిన అభివృద్ధి గురించి లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గని పిట్ ఇంజనీర్ సతీష్, సర్వేయర్ నజీరొద్దీన్, గని వెల్ఫేర్ ఆఫీసర్ జె శ్రీనివాస్ ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ వినయ్ కుమార్, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ బండారి బిక్షపతి, ఐఎన్టీయుసి పిట్ సెక్రెటరీ బూస రాజేష్, గని యాక్టింగ్ పీఓఏ ఎచ్ రవీందర్ పాల్గొన్నారు.


నస్పూర్‌లో..


రాకృష్ణాపూర్‌లో..

సంగీతరత్న అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



నవతెలంగాణ-జన్నారం

బహుజన సాహిత్య అకాడమీ వారి చేతుల మీదుగా సంగీతరత్న అవార్డు అందుకున్న తపాలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో1988-89లో పదవ తరగతి చదువుకున్న చంద్రయ్యను ఆ పాఠశాల అదే సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డు కాదని చదువు వల్లే జ్ఞానం, హోదా, గౌరవం లభిస్తాయన్నారు. చంద్రయ్య 2022లో తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు అలీ చేతుల మీదుగా సాహిత్య ఎక్సెలెన్స్ అవార్డును కూడా అందుకున్నారన్నారు. అతను ఎన్నో కవితలు గేయాలు రాసి సమాజాన్ని చైతన్య పరిచాడన్నారు. ఆమన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దుంపల తిరుపతి, పూర్వ విద్యార్థులు ఎండి ముస్తఫా, బుర్ర తిరుపతి, నాగేష్, రాజం, దావూద్‌ఖాన్ సత్యనారాయణ, అల్లం తిరుపతి, బండి రాజన్న, మమిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో జీర్ణోదరణ కార్యక్రమం

నవతెలంగాణ-భీమిని

భీమిని మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో శివ కేశవ ఆలయంలో సోమవారం దేవాలయ జీర్ణోదరణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పర్యగ్నికరణం, వాస్తు, అఘోర హోమాలు నిర్వహించారు. పురాతన దేవాలయంలో విగ్రహాలు, దేవాలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయ పునర్నిర్మాణం చేయనున్నారు. తాండూరు మండలం అచలాపూర్‌కు చెందిన వేద పండితులు అప్పాల శ్యామ్ ప్రణీత్ శర్మ ఆధ్వర్యంలో పూజ క్రతువు నిర్వహించారు. మండల రైతు సమన్వయ కన్వీనర్ బోనగిరి ఓం ప్రకాష్ గుప్తా దంపతులచే పూజ కార్యక్రమాలు నిర్వహించారు

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఉట్నూర్



ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే సానిటేషన్ వర్కర్ బిక్కు ఇటీవల మృతి చెందడంతో సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్, వైద్యులు మహేందర్, నర్సింగ్ సూపరింటెండెంట్ జాడి విమల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని తాండ్ర గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులు పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. విధులు నిర్వర్తిహించే సమయంలో అందరితో కలిసిమెలిసి ఉండేవారన్నారు. వారి వెంట ఆస్పత్రి సిబ్బంది శ్రీలత ఉన్నారు.

అంగన్వాడీ బడిబాట ర్యాలీ

నవతెలంగాణ-తలమడుగు



అంగన్వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. మూడు సంవత్సరాలు పూర్తయిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ, ప్రధానోపాధ్యాయులు వినోద్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, అంగన్వాడీలు మంజుల, రమణ, పద్మ పాల్గొన్నారు.

నేడు కౌలు రైతుల ప్రజా వేదికను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

కౌలు రైతుల ప్రజావేదికను విజయవంతం చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం సీపీఐ(ఎం) కార్యాలయంలో కౌలు రైతుల సమస్యలు పరిష్కార మార్గాలు అనే అంశంపై ప్రజా వేదిక ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని రెండు గ్రామాల్లో రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో 544 మంది రైతులను కౌలు రైతుల సర్వే ప్రకారం సర్వే చేస్తే అందులో 219 మంది కౌలు రైతులే ఉన్నట్లు గుర్తించామన్నారు. సుమారు 40 శాతం కౌలు రైతులు ఉన్నట్లు తేలిందన్నారు. సమావేశానికి రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు కిరణ్ విస్సా, కొండల్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజావేదికను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా తెలంగాణ విద్యుత్ దినోత్సవం



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజక వర్గాల వారీగా తెలంగాణా విద్యుత్ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. జడ్పీ ఛైర్పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జి. విఠల్ రెడ్డి, రేఖానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత విద్యుత్ రంగంలో ఎన్నో మార్పులు చేర్పులు జరిగాయని, నాటికి నేటికీ విద్యుత్ రంగంలో అభివృద్ధి చెందిందని అన్నారు. జిల్లాలోని నియోజకవర్గంలో జరిగిన విద్యుత్ ప్రగతి నివేదికపై పూర్తి వివరణ ఇస్తూ జిల్లాలో కొత్తగా నిర్మించబడిన 400కేవి సబ్ స్టేషన్ వెల్మల్ బొప్పారం, 3ఎన్‌టీసీ 132కేవి సబ్ స్టేషన్లు సారంగాపూర్, ఖానాపూర్ బూరుగుపల్లి, 37ఎన్‌టీసీ 33/11కేవి సబ్‌స్టేషన్లు నిర్మించుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఎస్సీ, ఎస్టీ నాయిబ్రాహ్మణులు, రజకులకు ఇస్తున్న రాయితీ పథకాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు రవాణా సౌకర్యం పెంపొందిస్తూ ఎలక్ట్రిక్ ఆటోలు, బైక్‌ల కొరకు కావలసిన రుణాలను స్త్రీనిధి అందిస్తోందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 952 మంది, ఖానాపూర్ నియోజకవర్గంలో 876 మంది, ముధోల్ నియోజకవర్గంలో 800 వినియోగదారులు హాజరయ్యారని తెలిపారు. అనంతరం స్త్రీనిధి సభ్యులకు ద్విచక్ర వాహనాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా అధికారి జయవంత్ చౌహన్, ఆర్‌డీఓ స్రవంతి, అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రోన్లు ఇప్పించాలి

- అఖిలపక్షం రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పత్తి, సోయాబీన్, కంది పంటలపై డ్రోన్ ద్వారా స్ప్రే చేయడానికి రైతులకు సబ్సిడీపై డ్రోన్లు ఇప్పించాలని అఖిలపక్షం రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి అడిషనల్ కలెక్టర్ నటరాజన్‌ను కోరారు. సోమవారం ప్రజావాణిలో అఖిలపక్షం రైతు సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నల్లరేగడి, ఎర్ర మట్టి భూములు అధికంగా ఉన్నాయని, నల్లరేగడి భూములలో పంటలు గట్టిగా పైర్లు దట్టంగా ఉంటాయని తెలిపారు. ప్రవేశించడానికి వీలుకాకుండా పైర్లు ఉండడంతో రైతులు పొలంలో నడుస్తూ మందులను స్ప్రే చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. స్ప్రే చేసే సమయంలో మందులు శరీరంలోకి ఇంకి జబ్బుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలా తరచు స్ప్రేలతో అస్వస్థకు గురై ఆసుపత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్ప్రే అంటేనే రైతు కూలీలు జంకుతున్నారని వివరించారు. రైతుల ఆరోగ్యం దృష్ట్యా పంటలకు మందులను స్ప్రే చేయడానికి డ్రోన్‌లను రైతులకు సబ్సిడీపై ఇప్పించాలని కోరారు. ఆయన వెంట అఖిలపక్ష రైతు సంఘం నాయకులు చిలుక దేవిదాస్, కొండ రమేష్, కేమ లక్ష్మణ్ ఉన్నారు.

అంగన్వాడీలో సీమంత వేడుకలు

నవతెలంగాణ-భీమారం

మండల కేంద్రంలోని ఆర్కెపల్లి అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక సీమంతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్ర పరిధిలోని గర్భిణులకు సీడీపీఓ, సూపర్‌వైజర్ రజిత, అంగన్వాడీ టీచర్ సధాలక్ష్మీ సంప్రదాయ పద్ధతిలో సీమంతం వేడుకలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలు ప్రారంభ సమయం ఆసన్నమవ్వడంతో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు బడీడుకు వచ్చిన తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని, అందుకోసం ప్రభుత్వం 'మనఊరు-మనబడి' కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మెరుగైన వసతులతో కూడి విద్యను అందిస్తుందని అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని ప్రతి పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆశాలకు ఎగ్జామ్ రద్దు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ఆశాలకు ఎగ్జామ్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. అర్బన్ రాంనగర్ పీహెచ్ సీ ముందు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ఆశా వర్కర్స్ ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలకు మందులు సకాలంలో అందిస్తున్నారన్నారు. ఆశాలు ప్రారంభం నుండి నేటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అన్ని శిక్షణలు పూర్తి చేశారని తెలిపారు. రికార్డులు రాయడం, టెస్టు చేయడం, ఆన్‌లైన్ పనులు చేయడం చేస్తున్నారని తెలిపారు. కరోనా మహమ్మారిని తరిమికొట్టే విధంగా ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రభుత్వం పరీక్ష పెట్టి ఉత్తీర్ణత సాధిస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని, లేకుంటే విధుల నుండి తొలగిస్తామని చెప్పడం దారుణమని విమర్శించారు. ఆశాలకు నష్టం కల్గించే ఈ నిర్ణయన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా 12న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, సంధ్య పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల ద్వారా

కార్మికుల జీవితాల్లో వెలుగులు

- జడ్పీ ఛైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- ఘనంగా సింగరేణి సంబురాలు



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సింగరేణి సంబురాలను బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న క్రీడామైదానంలో సింగరేణి ఏరియా జీఎం జి దేవేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, దుర్గం చిన్నయ్య, అదనపు పాలనాధికారి రాజేశం, ఎస్పీ సురేష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ సింగరేణి రాష్ట్రమంతటికి వెలుగులు అందిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కారుణ్య నియామకాల ద్వారా సింగరేణి సంస్థ ఉద్యోగాలు కల్పించడం వల్ల ఎంతోమంది సింగరేణి కార్మికులకు వరంగా మారిందన్నారు. సింగరేణి యాజమాన్యం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం గొప్ప విషయమని తెలిపారు. ఓపెన్ కాస్ట్ ముంపు ప్రాంతాలలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలతో పాటు నివాస గృహాలను నిర్మించి ఇవ్వాలని యాజమాన్యాన్ని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు, మంచిర్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణిగుంట ప్రవీణ్, ఎంపీపీ జుమిడి సౌందర్య ఆనంద్, జడ్పిటిసి వేముర్ల సంతోష్, సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి, పులి కుంట సర్పంచ్ బుర్స పోచమల్లు, కైరిగూడ సర్పంచ్, ఫ్యాక్స్ చైర్మన్ సంజీవ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు సోమారం తిరుపతి, హెచ్ఎంఎస్ నాయకులు పి.రాజబాబు, బిఎంఎస్ నాయకులు పేరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం క్రమక్రమంగా ఉపాధి హామీ పనులను తగ్గిస్తోందని విమర్శించారు. అందులో భాగమే ఉపాధి హామీలో కేటాయించిన బడ్జెట్లో నిధులు తగ్గించిందన్నారు. గడ్డపార, తట్ట, పారా పనిముట్లు కొనుగోలు చేసి ఇవ్వడం లేదన్నారు. 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించాల్సి ఉండగా నెలల తరబడి పెండింగ్ పెడుతున్నారని తెలిపారు. ఏరోజు కూలి ఎంత వస్తుందో తెలవక కూలీలు పనులకు వెళ్లడానికి జంకుతున్నారన్నారు. వెంటనే పేస్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. పనులు జరుగుతున్న ఏఒక్క చోట కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6లక్షల బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్, జిల్లా కమిటీ సభ్యులు సుంచుల నారాయణ, నాయకులు లక్ష్మీనారాయణవర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉంటేనే ఉపాధ్యాయ వృత్తికి సార్థకత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడినప్పుడే ఉపాధ్యాయ వృత్తికి సార్థకత లభిస్తుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం సాయంత్రం ఉన్నత, కేజీబీవీ, ఇంటర్మీడియెట్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో సబ్జెక్టుల వారీగా నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియట్, ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీ వంటి కోర్సులలో చేరేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా జూనియర్ ఇంటర్ కళాశాలలో వంద శాతం విద్యార్థులు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, కళాశాలల వారీగా విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రస్తుత కాలంలో కనీస విద్యార్హత డిగ్రీ ఉంటేనే ఏదైనా జాబ్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఉపకారవేతనాలు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ లాంటివి సదుపాయాలను అందిస్తున్న విషయాన్ని తెలియజేయాలని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ పాస్ అయిన ప్రతి విద్యార్థి దగ్గరలోని ఇంటర్, డిగ్రీ కళాశాలలో చేరేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్లు పి.శ్రీజ, వికాస్ మహతో, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి టి.ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



నవతెలంగాణ-నిర్మల్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఎస్‌టియు భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గజపల్లి నర్సయ్య మాట్లాడారు. 1972లో స్వీడన్‌లోని స్టాక్ హోంలో జరిగిన పర్యావరణ వేత్తల సదస్సులో ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకోటానికి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ సంవత్సరం ప్లాస్టిక్ వలన కలిగే నష్టాల నివారణ అంశంపై ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం 400 మిలియన్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి చేసి వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ ప్లాస్టిక్ నేలలో చేరి నీరు ఇనకకుండా, నాళాలలో చేరి మురికి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడమే కాకుండా జల చరాలకు హాని కలుగజేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు నూలు సంచులను వినియోగించి ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని సూచించారు. అదే విధంగా పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్యం నియంత్రించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు కృత్రిమ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలని, ప్రజలు ప్రజారవాణా వ్యవస్థ వినియోగించి కాలుష్యం, కర్బన ఉద్గారాల విడుదల తగ్గించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గాజర్ల నారాయణ వర్మ ఉపాధ్యక్షులు ముత్తన్న, కార్యదర్శులు గంగన్న శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేలా పోటీలను నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఇందిరా ప్రియదర్శిని మైదానంలో కేకే స్విమ్మింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పోటీలను సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. విత్ ట్యూబ్, వితవుట్ ట్యూబ్ విభాగాల్లో పోటీలను నిర్వహించగా చిన్నారులు తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాలను వెలికితీసేలా పోటీలను నిర్వహించిన కేకే అకాడమీ నిర్వాహకులు, కోచ్ కొమ్ము కృష్ణను అభినందించారు. స్విమ్మింగ్ క్రీడాకారుల ప్రతిభను గుర్తిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో అకాడమీ ద్వారా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, భారత జాగృతి అధ్యక్షులు రంగినేని శ్రీనివాస్‌రావు, కేకే అకాడమీ నిర్వాహకులు, కోచ్ కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.

ఊరూరా చెరువుల పండుగకు ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈ నెల 8న మండలంలోని వట్టివాగు వద్ద నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండుగకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ మల్లికార్జున్ సూచించారు. అధికారులతో కలిసి వట్టి వాగు సమీపంలో గల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల ప్రాధాన్యత తెలిసే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి వచ్చే రైతులకు ప్రజలకు, ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ గుణవంత్‌రావ్, తహసీల్దార్ రామ్మోహనరావు, ఎంపీడీవో శశికళ, ఎంపీఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

మాలీ కులస్తులను మోసగించిన కోనప్పకు గుణపాఠం చెప్పాలి



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మాలీ కులస్తులను మోసగించిన ఎమ్మెల్యే కోనప్పకు గుణపాఠం చెప్పాలని బీజేపీ నాయకులు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని హేటిగూడ, రుద్రపూర్, ఆడపెల్లి, డబ్బా, బాబాసాగర్ గ్రామాల్లో పల్లె పల్లెకు -గడప గడపకు బిజెపి పాల్వాయి పాదయాత్ర చేపట్టారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన హరీష్‌బాబు పాదయాత్రను నాయకులు, కార్యకర్తలతో కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాలీ కులస్తులను అన్ని విధాలుగా మోసం చేసిన ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఎస్టీ సర్టిఫికెట్ ఇప్పిస్తామని ప్రతి ఎన్నికల్లో వాగ్దానం చేసి ఆ విషయాన్ని అటకెక్కించారని విమర్శించారు. అలాగే మాలీలకు, నాయక్‌పోడ్ కులస్తుల భూములకు పోడు పట్టాలు ఇప్పించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్ములే మల్లయ్య, మోర్లే బాబురావు, దుర్గం కారు, మోర్లే దయన్న, పెర్గు లక్ష్మణ్, మోర్ల సాయి, కోట్రంగి తిరుపతి, శ్రీమన్నారాయణ, పురుషోత్తమాచారి, చాపిల సత్తన్న, డుబ్బుల సంజీవ్, డుబ్బుల మురళి, రౌతు భాస్కర్, మల్లేష్, రష్తన్ గణేష్, చందు యాదవ్ పాల్గొన్నారు.

కాసిపేట గనిపై తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట గనిపై సోమవారం గ్రూపు ఏజెంట్ కుర్మ రాజేందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసిన మేనేజర్ తెలంగాణ తల్లి, అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆట-పాటలు, నృత్యాలు, బోనాలు, బతుకమ్మ, పోతారాజుల నృత్యాలు, తెలంగాణ తల్లి వేషధారణ అందరిని ఆకర్షించాయి. తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ కారుణ్య నియామకం ద్వారా తాను అన్‌ఫిట్ అయితే కొడుకుకు ఉద్యోగం వచ్చిందని మాజీ ఎస్‌డిఎల్ ఆపరేటర్ కస్తూరి సత్యనారాయణ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ వచ్చాక రూ.10లక్షల వడ్డీ మాఫీ ద్వారా తాను లాభ పడ్డానని సోల్లంకి శ్రీనివాస్ అన్నారు. ఏఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, ఫిట్ సెక్రెటరీ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో తాను కూడా ఉన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ ఏరియా కార్యదర్శి ఒడ్నాల రాజన్న, రక్షణ అధికారి సునీల్ కుమార్, అధికారుల సంఘం సెక్రెటరీ బాబు, మధుకర్, స్వేరోస్ రాష్ట్ర కో కన్వీనర్ బన్న లక్ష్మణ్‌దాస్, టిబిజికెఎస్, ఏఐటీయూసీ నాయకులు సోల్లంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావాణికి వెలువెత్తిన అర్జీదారులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి సోమవారం వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పోటెత్తారు. జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఆర్డీఓ రాజేశ్వర్ వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి సమస్యల నిమిత్తం కలెక్టరేట్‌కు వస్తున్నప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. తీసుకున్న అర్జీలను పరిష్కరించే విధంగా చూడాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

మందకృష్ణ సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 6న జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో నిర్వహించే మందకృష్ణ మాదిగ సభకు మాదిగలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ రేగుంట కేశవరావు అన్నారు. అంబేద్కర్‌చౌక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో భాగంగా 3 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా 6న జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకు మందకృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని మాదిగలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని, వర్గీకరణ ఆకాంక్షను చాటి చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి ఎనిమిది సంవత్సరాలైనా ఇంకా ఆ దిశగా అడుగులు వేయకపోవడం దారుణమన్నారు. దీన్ని నిరసిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చే విధంగా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాలకవర్గం చేసిన అన్యాయాన్ని సభతో చాటి చెప్పాలని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగాల రాష్ట్ర కార్యదర్శి పస్తం అంజన్న, వీహెచ్‌పిఎస్. జిల్లా అధ్యక్షులు బన్నమూర్తి, మహిళా సమైక్య మండల నాయకురాలు ఇప్ప లక్ష్మి మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ఎండి రజీహైదర్, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ రేగుంట మహేష్ పాల్గొన్నారు.

రోడ్డుపైన భోజనాలతో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
దివ్యాంగుల తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదుట వికలాంగుల హక్కుల జాతీయ వేదిక చేపట్టిన ధర్నా కొనసాగుతోంది. ఇందులో భాగంగానే సోమవారం ధర్నా శిబిరంలోనే వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి కలెక్టరేట్ ఎదుట రోడ్డుపైన దివ్యాంగులు అందరూ భోజనం చేశారు. ప్రజా ప్రతినిధులు అధికారులు తమ సమస్యను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పట్టణంలో వికలాంగుల కాలనీ మంజూరు చేయాలని జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను మహాసభలకు అనుమతించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



మేడ్చల్‌లో మంగళవారం జరగనున్న మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభలలో మున్సిపల్ కార్మికులు పాల్గొనేందుకు అనుమతించాలని కోరుతూ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మున్సిపల్ ఎస్పై ఎం.నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించడం జరుగుతుందని అన్నారు. అలాగే నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఉన్నారు.

రిమ్స్‌లో పండ్ల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రిమ్స్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రతి వార్డులో పండ్ల పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రిమ్స్ ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షులు బండ శ్రీను, జనరల్ సెక్రెటరీ తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సారయ్య, రవి, చంద్రశేఖర్ గౌడ్, సంతోష్, జ్యోతి, మమత, సునీత, అశోక్ పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ నిధి పథకం జిల్లా కన్వీనర్‌గా శివన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
కుటుంబ సంక్షేమ నిధి పథకం జిల్లా కన్వీనర్‌గా శివన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ సంక్షేమ నిధి పథకం జిల్లా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం టీఎస్‌యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా కమిటీ సంఘం కార్యాలయంలో పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఘనంగా విద్యుత్ విజయోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కౌటాల
తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్ హాలులో విద్యుత్ విజయోత్సవ వేడుకలను నియోజకవర్గ విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యుత్ విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బొర్కాడే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా అన్నిరంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తూ తెలంగాణ రాష్ట్రం ముందుకుసాగుతున్నదని అన్నారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్తు వినియోగంతో కౌటల మండలంలోని తాటిపల్లి రైతులు మిర్చి పంట వేసి అధిక దిగుబడి రావడంతో గతంలో ఉన్న అప్పులు కూడా తీరిపోయాయని రైతులు తెలిపారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుంరం మాంతయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్
పట్టణంలోని స్థానిక శివాజీ నగర్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సోమవారం చెన్నూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా ఏ నాయకుడు పట్టించుకొని సమస్య పరిష్కరించామని అన్నారు. సుమారు 40 వేలకు పైగా ప్రజల విద్యుత్ కష్టాలు తీరుతున్నాయన్నారు. మున్సిపాలిటీలోని 12,263 గృహ, వాణిజ్య, వ్యవసాయ, కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. అలాగే సబ్ స్టేషన్ నిర్మాణంతోపాటు పట్టణంలోని ఏ-జోన్, బీ-జోన్, క్యాతనపల్లి, గద్దెరాగడి, అమరవాదిలలో ఐదు ఫీడర్ల నిర్మాణం పూర్తయిందని, దీనితోపాటు 6 కిలోమీటర్ల 11 కేవీ, 4 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్లను నూతనంగా ఏర్పాటు చేశారని తెలిపారు. రామకృష్ణాపూర్ పేరుకు పెద్ద పట్టణమైన 33/11 కేవీ సబ్ స్టేషన్ లేకపోవడంతో మంచిర్యాలలోని రాజీవ్‌నగర్, ఎసీసీ సబ్ స్టేషన్ పాలచెట్టు నుండి విద్యుత్ సరఫరా అయ్యేదని ఏ చిన్న సమస్య వచ్చినా పట్టణం మొత్తం అంధకారంలోకి వెళ్లిపోయేదని, ఇకపై ఎలాంటి సమస్య ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య పాల్గొన్నారు.



రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తాం



నవతెలంగాణ-తాంసి
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం జరుగుతుందని టీపీసీసీ సభ్యులు డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు సోమవారం భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా మండల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులను అన్ని విధాల ఆదుకొని ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడంతో పాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందామని అన్నారు. రాహుల్ గాంధీ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మెనిఫెస్టో గడపగడపకు ప్రచారం చేద్దామని అన్నారు. కర్నాటక రాష్ట్రంలో వచ్చిన ఫలితాలని తెలంగాణ రాష్ట్రంలో వచ్చే విధంగా కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌడాల సంతోష్, ఆన్ను పటేల్, అజయ్, సుదర్శన్, కైలాస్, రాజబలి, నారాయణరావు, కేశవ్, కాంతారావు, పరమేష్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్
విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటుగా ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కట్ట లక్ష్మణచారి డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో జరగనున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం బహిరంగ సభ పోస్టర్లను స్థానిక ప్రెస్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన శ్రీకాంత్ చారిల జయంతి వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సమావేశానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఆర్థిక సాయం, ఇండ్లులేని విశ్వకర్మలకు ప్రతి ఒక్కరికి మూడు లక్షలు కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు విజయ్, భీమన్న ప్రభాకర్, రవీందర్, సాయి కృష్ణ ఉన్నారు.



నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కాసిపేట
మండలంలోని కోమటిచెను గ్రామపంచాయతీకి చెందిన నిరుపేద కుటుంబం అయిన జాడి రవి-లక్ష్మీ దంపతుల కుమార్తె వివాహానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రూ.ఐదు వేలను స్థానిక సర్పంచ్ రామటేంకి శ్రీనివాస్ ద్వారా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోమటిచెను ఉపసర్పంచ్ దుర్గం సూర్యప్రకాష్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కుమ్మరి శేఖర్, వార్డు సభ్యులు జాడి స్వరూప పాల్గొన్నారు.



చెరువుల పండగ సన్నాహక సమావేశం



నవతెలంగాణ-భీమిని
ఈ నెల 8 న నిర్వహించే చెరువుల పండగను ఘనంగా నిర్వహించేందుకు మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మండల అధికారులు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు చెరువులకు ప్రత్యేకంగా నియమించబడిన ప్రత్యేక అధికారులు, ఐకేపీ, అంగన్‌వాడి టీచర్లతో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అధ్యక్షతన ఫణీందర్‌రావు మండల ప్రత్యేక అధికారి శేఖ్ సఫ్దర్ అలీ సమీక్షించారు. చెరువుల వద్ద వేదిక, భోజనాల స్థలం గుర్తించి ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ స్థలాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఐకేపీ మహిళలు బోనాల ఏర్పాటు చేయాలని అంగన్‌వాడి టీచర్లు బతకమ్మలు ఏర్పాటు చేయాలని బాధ్యతలు అప్పగించారు. దీనికి అవసరమయ్యే సామాగ్రిని మండల పరిషత్ నుంచి అందిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఏఈ ప్రణీత్, మండల విద్యాధికారి ఎం.మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు

బాలికల అండర్-16 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్
పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర బాలికల ఫుట్ బాల్ పోటీలను సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుడ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నంటి రఘునాథ్, రాష్ట్ర కార్యదర్శి జీపీ పాల్గొన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారు పాల్గొననున్నారని తెలిపారు. గెలుపొందిన వారికి చివరి రోజు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ బాల్ కోచ్ లు, పిఈటీలు, క్రీడాకారులు, రెండవవార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ పాల్గొన్నారు.

చెరువుల పండుగ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జైపూర్
దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న గ్రామాల వారిగా నిర్వహించే చెరువుల పండుగను విజయవంతం చేసుకోవాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ కోరారు. ఇరిగేషన్ ఏఈ శశాంక్ రెడ్డితో కలిసి సోమవారం మండల పరిధిలో గల వివిధ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా చెరువులను పరిశీలించిన ఆయన స్థానిక సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామస్తులతో చెరువుల పండుగ చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ పంటల సాగు సమీపిస్తున్న నేపథ్యంలో తొలకరికి ముందు రైతులు కట్ట మైసమ్మలకు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందని అదే ఒరవడితో చెరువుల పండుగ జరుపుకోవాలని కోరారు. డప్పు వాయిద్యాలు, బోనాలు, కోలాటలతో చెరువు కట్టలను చేరుకోవాలని తెలిపారు.

కోటపల్లి : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 8వ తేదీన నిర్వహించే చెరువు పండుగ గురించి చెన్నూర్ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ టి.శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీఓ అజ్మత్ ఆలీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.